సంచారజాతుల కాలం తొలగించడం సరి కాదు

సమావేశంలో మాట్లాడుతున్న భూపతి

తొర్రూరు, నవంబర్11 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వేలో సంచార జాతుల కాలమ్‌ను తొలగించడం సరైంది కాదని.., రాష్ట్రంలో రాక్షపాలన నడుస్తోందనడానికి ఇదే నిదర్శనమని జిల్లా సంచార జాతుల అధ్యక్షుడు, వీరభద్ర కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సంచార జాతి కమిటీ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. నిత్యం ప్రత్యర్థులను సంచార జాతుల కులాల్లోని పేర్లు వాడుతూ దూషించే ముఖ్యమంత్రికి సంచార జాతులంటే ఎందుకు అంత కక్షో అర్థం కావడం లేదన్నారు. సంచార జాతులను సర్వే కాలమ్ నుంచి తొలగించడాన్ని జిల్లా సంచార జాతుల సంఘం, వీరభద్ర కుల సంఘం తీవ్రంగా ఖండిస్తుందని, తక్షణమే సంచార జాతుల కాలాన్ని చేర్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే సంచార జాతుల బిడ్డలు సర్వేను బహిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాపయ్య యాకయ్య, రాజు పాల్గొన్నారు.

ఆర్డీవోకు వినతి పత్రాన్ని అందిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

విశ్వబ్రాహ్మణ కులం పేరును చేర్చాలి

తొర్రూరు, నవంబర్ 11 : కుల గణన సర్వేలో విశ్వబ్రాహ్మణ కుల నామాన్ని చేర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం రెవెన్యూ డివిజన్ అధికారి, తహసీల్దార్‌కు ఆ సంఘం నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడుతూ సర్వేలో విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గాన్ని అవమానపరిచేలా కులం ప్రస్తావన లేకుండా వృత్తులకు సంబంధించిన కోడ్‌లు కేటాయించి వర్గీకరణ చేపట్టడం శోచనీయమన్నారు.కార్యక్రమంలో చెన్నోజు విజయకుమారాచారి, కల్లూరి నాగేంద్రాచారి, దేవరకొండ శ్రీనివాసాచారి, పూర్ణాచారి, దేవేంద్రాచారి, కల్లూరి కుశాల్, శ్రీనివాససాచారి పాల్గొన్నారు.

బాలగోపాల్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 11 : డాక్టర్ బాలగోపాల్ అందరివాడు, విద్యార్థులు ఆయనను రోల్ మోడల్‌గా తీసుకోవాలని విశాఖపట్నానికి చెందిన ప్రముఖ న్యాయవాది జహా అరా అన్నారు. కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన సెనేట్ హాల్‌లో 14వ బాలగోపాల్ స్మారక ఉపన్యాస కార్యక్రమం 'స్త్రీల హక్కులు: రోల్ ఆఫ్ జ్యుడీషియరీ' అనే అంశంపై నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత దేశంలో విస్తృత మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. కార్యక్రమంలో న్యాక్ పూర్వ సంచాలకులు వీఎస్ ప్రసాద్, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ హరగోపాల్, రిజిస్ట్రార్ మల్లారెడ్డితో పాటు బాలగోపాల్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కేయూ దూరవిద్య పీజీ పరీక్షలు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 11 : కాకతీయ విశ్వవిద్యాలయ దూరవిద్య పీజీ మొదటి సంవత్సర పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైనట్లు పరీక్షల నియంత్రణ అధికారి నరసింహాచారి తెలిపారు. నగరంలోని పలు కేంద్రాల్లో అదనపు పరీక్షల నియంత్రణ అధికారి నరేందర్‌తో కలిసి ఆయన పరీక్షల తీరుతెన్నులను పరిశీలించారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

విద్యార్థులు లక్ష్యంతో ఉన్నత చదువులు చదవాలని, చాంబర్ ఆఫ్ కామర్స్ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అన్నారు. సోమవారం ఆమె మండల కేంద్రంలోని మైనార్టీ సాంఘిక సంక్షేమ పాఠశాలలో భారత తొలి విద్యాశాఖ కేంద్రమంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమంలో పాల్గొని పుష్పాంజలి ఘటించారు. కర్కాల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రమాణ స్వీకారోత్సవ పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ, మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం తొర్రూరు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మచ్చ సురేశ్ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ హరిప్రసాద్, ఏఎంసీ వైస్ చైర్మన్ భట్టూనాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈవో మురళి, నాయకులు పాల్గొన్నారు.

తొర్రూరులో బాలికలకు బహుమతులను అందిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

'విద్యా వ్యతిరేక విధానాలను ఖండిస్తున్నం'

దంతాలపల్లి, నవంబర్ 11: ప్రస్తుత ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఖండిస్తున్నట్లు టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి తాళ్లురి రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఎన్నుకున్న టీపీటీఎఫ్ జిల్లా కమిటీలో, రవీందర్‌ను జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో కనీస వసతులు లేవని, ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామనడం సరైంది కాదన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న యూత్ సభ్యులు

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

గూడూరు, నవంబర్11 : మృతుడి కుటుంబానికి పృథ్వీయూత్ క్లబ్ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన గుర్రం మల్లేశ్ కుమారుడు గుర్రం సందీప్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన కుటుంబానికి క్లబ్ సభ్యులు తమ వంత సహాయంగా రూ.5వేలను అందించారు. ఈ కార్యక్రమంలో ముత్యం శ్రీనివాస్, దోసపాటి శ్రీనివాస్, పుల్లూరి రాజు, బత్తుల రమేశ్, మేరెడ్డి శేఖర్, సుమన్, అశోక్ పాల్గొన్నారు.

వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ కుటుంబానికి..

హనుమకొండ : వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ మాదాజి కుటుంబానికి తెలంగాణ వెటర్నరీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యవర్గం రూ.50వేల ఆర్థికసాయం అందజేసింది. ఇటీవల మాదాజి మరణించిన నేపథ్యంలో బాలసముద్రంలోని ఆయన నివాసానికి వెళ్లి చెక్కు అందజేసినట్లు కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, ట్రెజరర్ బాలాజీ, ఉపాధ్యక్షుడు మురళీధర్‌రావు పాల్గొన్నారు.

తైక్వాండో జట్టు ఎంపిక

ఎంపికైన టీంతో వెంకయ్య

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 11 : అమృతసర్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీలో జరిగే తైక్వాండో(మహిళా) ఆలిండియా జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల టీంను ఎంపిక చేసినట్లు విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి వెంకయ్య తెలిపారు. హనుమకొండ కాకతీయ డిగ్రీ కాలేజీ నుంచి శిరీష, తేజశ్విని, వరంగల్ వాగ్దేవి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్సు నుంచి శ్రావణి, జనగామ ఏకశిల డిగ్రీ కాలేజీ నుంచి రుద్ర, చెన్నూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నుంచి నాగలక్ష్మి, మహబూబాబాద్ నలంద డిగ్రీ కాలేజీ నుంచి తులసి ఉన్నట్లు తెలిపారు. వీరికి మహబూబాబాద్ నలంద డిగ్రీ కాలేజీ పీడీ రమేశ్ మేనేజర్‌గా వ్యవహరించనున్నట్లు చెప్పారు. కాగా, విద్యార్థులను వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ అభినందించారు.

కొనుగోలు కేంద్రాల్లోకి ధాన్యం తరలించాలి

పెద్దవంగర, నవంబర్ 11 : రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించాలని ఏవో స్వామి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని చిట్యాల కొనుగోలు కేంద్రంలో ధాన్యం నాణ్యతను పరిశీలించి మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొస్తేనే గిట్టుబాటు ధర రావడంతో పాటు రూ.500 బోనస్ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు యశస్విని, రాజు, విశ్వశాంతి పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

- అదనపు కలెక్టర్ విజయలక్ష్మి
- రాయపర్తిలో గురుకుల జోనల్ క్రీడోత్సవాలు ప్రారంభం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అదనపు కలెక్టర్

రాయపర్తి, నవంబర్ 11: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అదనపు కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ఆవరణలో తెలంగాణ స్టేట్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ నేతృత్వంలో పదో జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ 2024-25ను మల్టీ జోనల్-1 ఆఫీసర్ కాంపాటి అలివేలుతో కలిసి ఆమె ప్రారంభించారు. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన 14 బాలికల గురుకులాల్లోని 1,190 మంది క్రీడాకారిణులు తలపడుతున్న క్రీడోత్సవాలను క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో ఆటల పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఈ నెల 14 వరకు జోనల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌ను విజయంతానికి జోన్ పరిధిలోని డీసీఓలు, గురుకులాల యాజమాన్యాలు, బోధన, బోధనేతర సిబ్బంది, పీడీలు, పీఈటీలు కృషి చేయాలని కోరారు. క్రీడా ప్రారంభోత్సవాల సందర్భంగా గురుకుల విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, సామూహిక నృత్యాలు, మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకున్నాయి. తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్, వరంగల్, హనుమకొండ డీసీఓలు పోతుల అపర్ణ, దాసరి ఉమామహేశ్వరి, ప్రిన్సిపాల్స్ సముద్రాల సరిత, రాయరాకుల సమ్మయ్య, కలమ్మ, ప్రభావతి, రమ్యసుధ, లీల, జ్యోతి, సృజన, కల్పన పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ సత్య నారాయణరెడ్డి

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

డోర్నకల్, నవంబర్11 : పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఆయన ముల్కలపల్లి జడ్పీహెచ్ఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు స్పెషల్ క్లాస్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠ్యాంశాలపై సందేశాలుంటే వెంటనే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మి, హెచ్ఎం రుక్మాంధరావు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి

కొత్తగూడ, నవంబర్ 11 : చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని రౌతుగూడెం సమీపంలోని జగ్గారావుకుంటలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కొత్తగూడ మండలంలోని రౌతుగూడెం గ్రామానికి చెందిన బోడ శ్రీను(43)ది వ్యవసాయం కుటుంబం. సోమవారం చేపల వేట కోసం అల్లుడితో కలిసి శ్రీను గ్రామ శివారులోని జగ్గారావుకుంటలోకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని మృతిచెందాడు. శ్రీనుకు భార్య శారద, కొడుకు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

హామీలను అమలు చేయాలి

నెల్లికుదురు, నవంబర్ 11 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ తక్షణమే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో సోమవారం జరిగిన 7వ మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సీఎం రేవంత్‌రెడ్డి కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. రూ.2లక్షల వరకు రుణమాఫీ అని చెప్పి కనీసం 25 శాతం మందికి కూడా చేయలేదన్నారు. రైతుభరోసాను పెంచి ఇస్తామని చెప్పి ఉన్న రైతుబంధు డబ్బులు కూడా ఇంతవరకు బ్యాంకు ఖాతాల్లో జమచేయలేదని ఆరోపించారు. మాజీ సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులను చెల్లించకుండా ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలను అష్టకష్టాలకు గురి చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజన్న, మండల కార్యదర్శి తిలక్‌బాబు, నాయకులు సైదులు, బాబుగౌడ్, మంగ్యా నాయక్, సత్యనారాయణ, యాకయ్య పాల్గొన్నారు.

విదర్భలో విజేతదే మహా పీఠం

- ఇక్కడ 62 అసెంబ్లీ నియోజకవర్గాలు
- ఈ ప్రాంతంలో పట్టు సాధిస్తే అధికారం పక్కా
- ప్రత్యేక దృష్టి సారించిన రెండు కూటములు

ముంబై, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర ఎన్నికలు సమీపిస్తున్న వేళ రెండు కూటములు విదర్భ ప్రాంతంపై ప్రత్యేకంగా దృష్టి సారించాయి. 62 నియోజకవర్గాలు ఉన్న విదర్భలో పాగా వేస్తే అధికారానికి దగ్గరైనట్టే అని కూటములు లెక్కలు వేసుకుంటున్నాయి. ఇక్కడి ప్రజలను ఆకర్షించి మెజార్టీ సీట్లు తమ ఖాతాలో వేసుకోవాలని తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఇప్పటికే రెండు కూటముల నుంచి అగ్రనేతలు విదర్భ మొత్తాన్ని చుడుతూ ప్రచారం చేస్తున్నారు. ఎక్కువగా పత్తి పండించే రైతులు ఉన్న ఈ ప్రాంతంలో రైతులు ఎటువైపు నిలుస్తారనేది గెలుపోటములను నిర్ణయించనుంది.

రెండు కూటములకూ కీలకం

విదర్భలోని మొత్తం 62 స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ 36 స్థానాల్లో ప్రత్యక్షంగా తలపడుతున్నాయి. 11 జిల్లాలు కలిగిన విదర్భ ప్రాంతం 1990ల వరకు కాంగ్రెస్‌కు కంచుకోట. మూడు దశాబ్దాలుగా ఇక్కడ బీజేపీ - శివసేన కూటమి పట్టు పెంచుకుంది. 2014లో ఇక్కడ బీజేపీ ఒంటరిగా పోటీ చేసి 44 స్థానాలను గెలుచుకుంది. 2019లో 29 స్థానాలకు పడిపోయింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) ఇక్కడ మంచి ఫలితాలను సాధించింది. విదర్భలోని 10 లోక్‌సభ స్థానాల్లో ఏడు స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో విదర్భలో పాగా వేసేందుకు ఎంవీఏ ప్రయత్నిస్తున్నది. ఆరెస్సెస్ కేంద్ర కార్యాలయం విదర్భలోనే నెలకొని ఉండటం, రాష్ట్ర బీజేపీకి జోడుగుర్రాల్లాంటి దేవేంద్ర ఫడ్నవీస్, చంద్రశేఖర్ బవాంకులే ఈ ప్రాంతానికి చెందిన వారే కావడంతో బీజేపీ ఈసారి విదర్భ ప్రాంతాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది.

మేఘాల్లోనూ మైక్రోప్లాస్టిక్

- పర్యావరణాన్ని ప్రభావితం చేస్తుండొచ్చు
- శాస్త్రవేత్తల ఆందోళన

న్యూఢిల్లీ: భూమిని మొత్తం ఆక్రమించేసిన మైక్రోప్లాస్టిక్స్ మేఘాల్లోకీ చేరాయని, ఇవి పర్యావరణాన్ని సైతం ప్రభావితం చేస్తుండొచ్చని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి అమెరికాలోని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు చేసిన ఓ అధ్యయనంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆకాశంలో మైక్రోప్లాస్టిక్‌లు మంచు కేంద్రక రేణువులుగా పని చేసి అసహజంగా మేఘాల ఏర్పాటుకు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. సాధారణంగా మేఘాలు ఏర్పడే పరిస్థితులు లేకపోయినా మైక్రోప్లాస్టిక్‌లు మేఘాలు ఏర్పడేలా చేస్తాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని నిర్ధారించడం కోసం పరిశోధకులు నాలుగు రకాల మైక్రోప్లాస్టిక్‌లను ప్రయోగశాలలో పరీక్షించారు. ఇందుకోసం నీటి బిందువులను చల్లబరిచి మంచుగా మార్చారు. మైక్రోప్లాస్టిక్ లేని నీటి బిందువులు మైనస్ 38 డిగ్రీల సెల్సియస్ వద్ద గడ్డ కట్టగా, 50 శాతం మైక్రో ప్లాస్టిక్‌లతో కలుషితమైన నీటి బిందువులు మైనస్ 22 డిగ్రీల సెల్సియస్ వద్దనే గడ్డ కడుతున్నట్టు తెలుసుకున్నారు. కాబట్టి మైక్రో ప్లాస్టిక్‌లు మేఘాల నిర్మాణాన్ని ప్రభావితం చేస్తున్నాయని అర్థమవుతున్నదని శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఫ్రీడ్‌మన్ తెలిపారు.

ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా రాకెట్ల వర్షం

90కి పైగా క్షిపణుల ప్రయోగం • పలువురికి గాయాలు • ధ్వంసమైన వాహనాలు

హెజ్బొల్లా రాకెట్ దాడులతో ఇజ్రాయెల్‌లోని హైఫాలో దహనమవుతున్న కార్లు

బీరుట్, నవంబర్ 11: ఇజ్రాయెల్-హెజ్బొల్లా మధ్య పోరు మరింత తీవ్రరూపం దాల్చింది. లెబనాన్‌లోని హెజ్బొల్లా గ్రూప్ సోమవారం ఇజ్రాయెల్‌పై వరుస రాకెట్ దాడులతో విరుచుకుపడింది. ఇజ్రాయెల్ నగరం 'హైఫా' లక్ష్యంగా 90కిపైగా క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో హైఫాలో పలు భవనాలు దెబ్బతిన్నాయని, పలువురు గాయపడ్డారని, వాహనాలు ధ్వంసమయ్యాయని మీడియా కథనాలు పేర్కొన్నాయి. హెజ్బొల్లా ప్రయోగించిన పలు మిస్సైల్స్‌ను ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ 'ఐరన్ డోమ్' అడ్డుకున్నప్పటికీ, మరికొన్ని హైఫాలో పలు జనావాస ప్రాంతాల్లో తాకాయని తెలిసింది. ఒక చిన్నారి సహా నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారని ప్రాథమిక సమాచారం. హెజ్బొల్లా రాకెట్ దాడుల్ని ఇజ్రాయెల్ భద్రతా బలగాలు (ఐడీఎఫ్) ధ్రువీకరించాయి. హైఫా పట్టణం శివారు ప్రాంతాల్లో మిస్సైల్స్ తాకాయని ఐడీఎఫ్ పేర్కొన్నది.

శ్మశానం కింద హెజ్బొల్లా సొరంగం!

హెజ్బొల్లా సభ్యులు ఉపయోగించే సొరంగాలను ధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ సైన్యం(ఐడీఎఫ్) ఆదివారం తెలిపింది. వీటిలో ఒకటి శ్మశానం కింద ఉందని ఆరోపించింది. కిలోమీటర్ పొడవున ఉండే ఈ సొరంగాలను గుర్తించామని ఎక్స్‌లో ఒక వీడియోను పోస్ట్ చేసింది. ఈ సొరంగాల్లో కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్స్, నిద్రించే గదులు, ఆయుధగారాలు ఉన్నట్టు ఐడీఎఫ్ వెల్లడించింది. ఓ సొరంగంలో డజన్ల కొద్దీ ఆయుధాలు, ఇతర సైనిక సామగ్రి ఉన్న వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'ఉగ్రవాదుల అండర్ గ్రౌండ్ సొరంగాలను మా దళాలు ధ్వంసం చేశాయి. అందులో వ్యూహాత్మకంగా శ్మశానం కింద కూడా ఒకటి ఉంది. హెజ్బొల్లా మనుషులు చనిపోయినా, బతికున్నా వారికి విలువ ఇవ్వదు' అని ఐడీఎఫ్ విమర్శించింది.

ఇరాన్ రసాయన ఆయుధాల అభివృద్ధి!

ఇజ్రాయెల్ సైనికులు, పౌరులపై ప్రయోగించేందుకు ఇరాన్ రసాయన ఆయుధాల్ని సిద్ధం చేసిందన్న వార్తలు వెలువడ్డాయి. ఔషధ తయారీలో రసాయన ఏజెంట్స్‌గా వాడే సింథటిక్ ఓపియాయిడ్లు, ఫెంటానేల్.. వంటి వాటితో ఇరాన్ రసాయన ఆయుధాల్ని అభివృద్ధి చేసిందని అమెరికా రక్షణ రంగ నిపుణుడు మాథ్యూ లెవిట్ వెల్లడించారు. శక్తివంతమైన రసాయన ఏజెంట్స్‌తో గ్రనెడ్లు, బాంబులను ఇరాన్ తయారుచేసిందని, వీటి ప్రభావానికి లోనైతే.. బాధితుల నాడీ వ్యవస్థ కొన్ని క్షణాల్లో దెబ్బతింటుందని తెలిపారు. ఇజ్రాయెల్ సైన్యం, పౌరులు లక్ష్యంగా ఈ రసాయన ఆయుధాల్ని ప్రయోగించేందుకు ఇరాన్ తయారు చేసిందని చెప్పారు. దీనిపై ఆయన రాసిన ఆర్టికల్ చర్చనీయాంశమైంది. ఇరాన్ రసాయన ఆయుధాల తయారీని తక్కువ అంచనా వేయడానికి వీల్లేదని హెచ్చరించారు. రసాయన ఆయుధాల నుంచి వెలువడే పొగను ఒకసారి పీల్చిగానే, బాధితులు వెంటనే స్పృహ కోల్పోతారని, ఇజ్రాయెల్ సైనికులు, పౌరులను బందీలుగా చేసుకోవడానికి ఇరాన్ వాడొచ్చునని చెప్పారు.

భగత్‌సింగ్ ఓ ఉగ్రవాది: పాక్

లాహోర్: బ్రిటిష్ వలస పాలకులపై వీరోచితంగా పోరాడి, ప్రాణ త్యాగం చేసిన భగత్ సింగ్ పట్ల పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రభుత్వం దురహంకారంతో వ్యవహరించింది. ఆయనను గౌరవించేందుకు తిరస్కరించింది. షడ్మన్ చౌక్‌కు భగత్ సింగ్ పేరు పెట్టడాన్ని, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించింది. భగత్ సింగ్‌ను ఉగ్రవాదిగా పేర్కొనడంపై ఆమ్ ఆద్మీ పార్టీ ఘాటుగా స్పందించింది. దీనిపై పాకిస్థాన్‌ను వివరణ కోరాలని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బీజేపీ స్పందిస్తూ, పాకిస్థాన్ ఉగ్రవాదులకు ఆశ్రయమిస్తున్న విషయం అందరికీ తెలుసునని పేర్కొంది. భగత్ సింగ్‌ను అపఖ్యాతిపాలు చేయడం కోసం పాకిస్థాన్ నయవంచనకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేసింది.



BLOCKBUSTER నేడే చూడండి
అప్పుడో ఇప్పుడో ఎప్పుడో
BVSN PRASAD SUDHIER VARMA
సప్తగిరి 70 ఎంఎం ఎ/సి - ఆర్‌టిసి క్రాస్ రోడ్స్
11.00,2.00,6.00,9.00
మెగా - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట్ 11.15,2.30,9.45
భ్రమరాంబ ఎ/సి - కూకట్‌పల్లి 11.30,2.45
తాక్కూరి - ఇ.సి.ఐ.ఎల్ 11.15,2.15,6.15,9.15
AMB ఎఎంబి - గచ్చిబౌలి 1.40,4.30,7.40,10.20
ఎఎఎ - అమీర్‌పేట్ 7.40,10.35PM
PRASAD ప్రసాద్ - ఎన్.టి.ఆర్.గార్డెన్స్ 10.45PM
PVR ఆర్.కె - బంజారాహిల్స్ 11.30,8.15PM
PVR పిక్చర్‌హౌస్ - పంజాగుట్ట 1.20,4.25,7.15PM
PVR ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ 11.00,2.00,7.55PM
PVR నెక్టస్ మాల్ - కూకట్‌పల్లి 11.00,1.45,7.55,10.50
PVR సరిలేయా - పంజాగుట్ట 5.25PM
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 2.30,5.15,10.40PM
PVR పివిఆర్ - మూసారంబాగ్ 11.00,8.25,11.00PM
PVR ప్రిస్టన్ ప్లేమ్ - గచ్చిబౌలి 11.10,8.05PM
PVR బకాన్ - హైటెక్ సిటీ 1.45,4.50PM
PVR ATRIUM మాల్ - గచ్చిబౌలి 10.50,2.35,7.55PM
PVR PRISM మాల్ - గచ్చిబౌలి 11.15,5.15PM
Cinepolis లులు మాల్ - కూకట్‌పల్లి 10.20AM
Cinepolis డి.ఎల్.ఎస్ - ఉప్పల్ 4.45,8.15PM
Cinepolis మంత్రామాల్ - ఉత్తరాపూర్ 5.10PM
INOX బినాక్స్ - బంజారాహిల్స్ 11.15,7.40PM
INOX జి.ఎస్.ఎమ్ - మదీనాగూడ 1.40PM
INOX ఎం.ఎ.మాల్ - కాచిగూడ 11.15,7.50PM
INOX సత్యనెక్లెస్ మాల్ - కూకట్‌పల్లి 2.10PM
INOX అశోక ఎ/సి - మైజాంక్షన్ 10.40,4.00PM
AMB ఎఎంఆర్ - హయాత్‌నగర్ 10.30,3.45PM
MOVIETIME ఫ్లాటినమ్ - అమీర్‌పేట్ 11.00,4.30,10.00PM
MOVIETIME ప్రైమ్ మాల్ - సనత్‌నగర్ 11.00AM,10.00PM
MOVIETIME ఫ్లాటినమ్ - గచ్చిబౌలి 3.15,10.30PM
ASIAN సినీ స్క్వేర్ - ఉప్పల్ 4.40,10.45PM
ఎం.జె.ఆర్ - నారాయణ్‌పల్లి 1.50,10.35PM
GPK జిసిఆర్ - కూకట్‌పల్లి 10.15AM